క్లుప్తంగా

విలువలతో కూడిన విద్య అభ్యసించాలి

● మొదటి అదనపు జిల్లా ఇన్‌చార్జ్ న్యాయమూర్తి అమ్మనరాజా


బాలసదన్ సిబ్బంది ద్వారా సదుపాయాల గురించి తెలుసుకుంటున్న న్యాయమూర్తి అమ్మనరాజా

ఒంగోలు సిటీ: చిన్నతనం నుంచే విలువలతో కూడిన విద్య అభ్యసించాలని మొదటి అదనపు జిల్లా ఇన్‌చార్జ్ న్యాయమూర్తి, ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి డి.అమ్మనరాజా సూచించారు. శనివారం ఒంగోలులోని బాలసదన్‌ను సందర్శించి విద్యార్థులకు అందుతున్న వసతులు, భోజనం, సంబంధిత దస్త్రాలు, కార్యాలయ నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా అమ్మనరాజా మాట్లాడుతూ క్రమశిక్షణ వలన జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు అవసరమైన న్యాయ సహాయాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డీసీపీఓ దినేష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎండ్లూరులో పశు వైద్య శిబిరం

సంతనూతలపాడు: మండలంలోని ఎండ్లూరు గ్రామంలో శనివారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. 2,243 గొర్రెలు, మేకలు, దూడలకు నట్టల నివారణ మందు తాపించారు. పశువైద్యాధికారి డాక్టర్ పి.చిరంజీవి, సిబ్బంది, పశుపోషకులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం విఫలం

ఒంగోలు వన్‌టౌన్: ఎన్నికల సమయంలో చెప్పిన సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే సైదా విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తాళిబజావ్ పేరుతో ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయం ముందు శనివారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 7 నెలలు దాటినప్పటికీ సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలో తీవ్రంగా వైఫల్యం చెందిందన్నారు. ఎన్నికల హామీలు అమలుచేయకుండా ప్రజలను మోసం చేస్తోందన్నారు. తల్లికి వందనం, 20 లక్షల ఉద్యోగాల కల్పన, 3000 నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా కింద 20 వేల రూపాయల చెల్లింపు, మహిళలకు ప్రతి నెలా రూ.1,500 బ్యాంక్ ఖాతాలో జమ వంటి సూపర్ సిక్స్ పథకాల పేరుతో ఎన్నికల్లో ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రజలను నిలువునా మోసం చేశారంటూ మండిపడ్డారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి గౌతు సత్యేంద్ర బాబు, కైపు వెంకటకృష్ణారెడ్డి, బీఆర్ గౌస్, విజేష్ రాజ్, తదితరులు పాల్గొన్నారు.

● క్వింటా రూ.1,600 నుంచి రూ.1,800 మాత్రమే
● గతంలో రూ.2,500 నుంచి రూ.3 వేలు ఉన్న ధర
● ఒక్కసారిగా దిగజారడంతో పెట్టుబడులు కూడా రాని పరిస్థితి
● ఆందోళనలో రైతులు

కాండం తెగులుతో వాడిపోతున్న చామదుంప పంట


చామదుంప ధర చతికిలబడి..

కొత్తపట్నం: ఉద్యానవన పంటల్లో చామదుంప ఒకటి. ఇసుక నేలల్లో చామదుంపను అధికంగా సాగుచేస్తారు. కొన్నేళ్లుగా దిగుబడులు బాగా రావడంతో పాటు మంచి ధరలు కూడా పలికి రైతుకు ఆదాయం చేకూరుతుండటంతో కొత్తపట్నం మండలంలోని తీర ప్రాంతంలో గల ఇసుక నేలల్లో విస్తారంగా సాగుచేస్తున్నారు. మండలంలోని మోటుమాల, పాదర్తి, రంగాయపాలెం, కొత్తపట్నం, పిన్నింటివారిపాలెం, గమళ్లపాలెం, వజ్జిరెడ్డిపాలెం, రాజుపాలెం, ఈతముక్కల, మడనూరు గ్రామాల్లో మొత్తం 1,200 ఎకరాల్లో చామదుంప సాగుచేస్తున్నారు. ఎకరాకు రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టారు. అయితే, ఈ ఏడాది వర్షాలు ఎక్కువగా కురిసినందున చామదుంపలో ఆశించినంత దిగుబడులు రాలేదు. దీనికితోడు ధరలు కూడా సగానికి పడిపోయాయి. గత ఐదు సంవత్సరాలుగా క్వింటా రూ.2,500 నుంచి రూ.3 వేల వరకూ పలికింది. రైతుకు లాభం చేకూరింది. కానీ, ప్రస్తుతం ఒక్కసారిగా క్వింటా ధర రూ.1,600 నుంచి రూ.1,800కి పడిపోయింది. ఈ ధరలతో కనీసం పెట్టుబడులు కూడా వచ్చేలా లేవని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పైగా, గత ప్రభుత్వంలో రైతు భరోసా నగదు అందించడం వలన కొంతవరకు పెట్టుబడి ఖర్చు తగ్గింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతుకు ఎలాంటి పెట్టుబడి సాయం ఇవ్వకపోవడంతో పెట్టుబడి భారం పెరిగింది. అదే సమయంలో ధరలు తగ్గడంతో నష్టాలు వస్తాయని అన్నదాతలు దిగులు చెందుతున్నారు.

నిల్వ చేసుకునే సౌకర్యం లేకపోవడంతో...

ఇసుక నేలల్లో చామదుంప దిగుబడులు ఎక్కువగా వస్తాయి. అందువలన కొత్తపట్నం మండలంలోని తీర ప్రాంతంలో అధికంగా సాగుచేస్తారు. ఇక్కడి నుంచి తెలంగాణ, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, మహారాష్ట్ర, ఒడిశా వంటి రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. ఆయా రాష్ట్రాల్లో చామదుంపకు మంచి గిరాకీ ఉంది. కానీ, ఈ ఏడాది వ్యాపారులు ధరలు పూర్తిగా తగ్గించారు. మండలంలో పంటను నిల్వ చేసుకునే సౌకర్యం లేకపోవడంతో రైతులు చేసేది లేక తక్కువ ధరకే పంటను అమ్ముకుంటున్నారు. ప్రభుత్వం గిడ్డంగి సౌకర్యం కల్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

తెగుళ్లతో దిగజారిన దిగుబడులు...

ఈ ఏడాది అధిక వర్షంతో పాటు మంచు, చలిగాలుల ప్రభావం చామదుంప పంటపై పడింది. పంటలో ఎక్కువ భాగం తెగుళ్లబారిన పడి ఆకు కుళ్లిపోయింది. ఆకుమచ్చ తెగులు, కాండం తెగులు పంటను ఆశించి దిగుబడులు గణనీయంగా తగ్గాయి. దాంతో పాటు ధరలు కూడా పడిపోయాయి. తమను ప్రభుత్వం ఆదుకోవాలని చామదుంప రైతులు కోరుతున్నారు.

ఈ ఏడాది ధర తక్కువగా ఉంది



ఈ ఏడాది చామదుంప ధర చాలా తక్కువగా ఉంది. గత సంవత్సరంతో పోల్చుకుంటే సగానికి సగం ధరలు పడిపోయాయి. నేను 3 ఎకరాల్లో చామదుంప సాగుచేశా. ఇప్పటికే రూ.2 లక్షలకుపైగా ఖర్చుచేశా. పంటను తెగుళ్లు ఆశించి దిగుబడి కూడా అంతంతమాత్రంగానే ఉంది. ఏం చేయాలో అర్థం గాని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం ఆదుకోవాలి.

– మధు, రైతు, రంగాయపాలెం

పలు పోటీల్లో విజేతలకు బహుమతుల అందజేత


క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

చీమకుర్తి: రిపబ్లిక్ డే సందర్భంగా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి క్లబ్ ప్రతినిధులు శనివారం బహుమతులు అందించారు. చీమకుర్తిలోని డాక్టర్ చెరుకూరి వెంకటేశ్వర్లు ఇండోర్ స్టేడియంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 8, 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, దేశభక్తి గీతాలు, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందించారు. రోటరీ క్లబ్ వ్యవస్థాపకులు చెరుకూరి రఘుకిరణ్, డాక్టర్ పీ హరిణి, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కడవా రామకృష్ణ, కందుకూరి సుధాకర్ చేతుల మీదుగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు అడుసుమల్లి శ్రీనివాసరావు, పోకూరి రామకృష్ణారెడ్డి, అంబటి వీరారెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

కొత్తపట్నం: గణతంత్ర దినోత్సవం సందర్భంగా స్థానిక బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. హెచ్ఎం శ్రీదేవి, గణిత ఉపాధ్యాయుడు సీహెచ్ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలపై పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేయనున్నట్లు వారు తెలిపారు.

యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి


మాట్లాడుతున్న జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి రవితేజ

● జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి రవితేజ

మద్దిపాడు: యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి రవితేజ పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన జాబ్ మేళాలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా నిరుద్యోగ యువతను ఉద్దేశించి మాట్లాడుతూ యువత ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని సూచించారు. చిన్న ఉద్యోగమా.. పెద్ద ఉద్యోగమా అని ఆలోచించకుండా వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని కుటుంబానికి చేదోడుగా ఉండాలని సూచించారు. జాబ్ మేళాలో నాలుగు కంపెనీలు పాల్గొన్నాయి. తారిక మేనేజ్మెంట్ సర్వీసెస్ కంపెనీకి సంబంధించి 23 మంది హాజరవగా, 10 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. అదేవిధంగా రిలయన్స్ డిజిటల్ కంపెనీకి ఏడుగురు హాజరవగా, నలుగురు ఎంపికయ్యారు. ఐసీఐసీఐ కంపెనీకి ఆరుగురు హాజరవగా, ఒకరు ఎంపికయ్యారు. శ్రీరామ్ చిట్స్ కంపెనీకి ఏడుగురు హాజరవగా, ఇద్దరు ఎంపికయ్యారు.

మొత్తంమీద జాబ్ మేళాకు 43 మంది హాజరవగా, 14 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ముగ్గురు షార్ట్ లిస్ట్ అయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ ఏవో వరప్రసాద్, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి షేక్ బాషా, ప్లేస్మెంట్ ఆఫీసర్ ఏపీ ఎస్ఎస్‌డీసీ రమేష్ బాబు, జిల్లా ఉపాధి సంస్థ సభ్యులు, యంగ్ ప్రొఫెషనల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ వారు పాల్గొన్నారు.

సమసమాజమే సీఐటీయూ లక్ష్యం

కొత్తపట్నం: సమసమాజమే సీఐటీయూ లక్ష్యమని జిల్లా ఉపాధ్యక్షుడు పూనాటి ఆంజనేయులు అన్నారు. మండలంలోని కె.పల్లెపాలెం మదర్ థెరిసా వృద్ధాశ్రమంలో శనివారం నాయకత్వస్థాయి తరగతులను ఆయన ప్రారంభించారు. ముందుగా సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ 1970 తర్వాత సీఐటీయూ దేశంలో ఐక్యత పోరాట నినాదం తీసుకుని పనిచేస్తోందన్నారు. కార్మిక వర్గాన్ని ఐక్యం చేయడంలో కీలకపాత్ర పోషించిందన్నారు. ఇప్పటికీ దేశంలో అనేక పోరాటాల ద్వారా ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తోందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్, నాయకులు కాలం సుబ్బారావు, గంటినపల్లి శ్రీనివాసులు, కల్పన, ఎస్.స్వామిరెడ్డి, పట్టపు ప్రకాశం, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆంజనేయులు

ఘనంగా ఏకేవీకే వార్షికోత్సవం


కళాశాల కరస్పాండెంట్ చెంచురామయ్యను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, తదితరులు

ఒంగోలు సిటీ: స్థానిక అంజయ్యరోడ్డులోని ఆంధ్రకేసరి విద్యాకేంద్రం (ఏకేవీకే) డిగ్రీ, పీజీ కళాశాలలో 28వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కొలగట్ల వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా ఇందిరా ప్రియదర్శిని న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ కె.నటరాజ్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు గురువులను పూజించడం, దేశాన్ని ప్రేమించడం వంటి గుణాలు కలిగి ఉండాలని సూచించారు. తల్లిదండ్రులను గౌరవిస్తూ జీవితంలో ఎదగాలన్నారు. జీవితంలో అన్నీ సౌకర్యంగా ఉండవని, వాటిని సాధించుకుంటూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కష్టపడే తత్వం అలవరచుకుంటే విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ క్రమశిక్షణతో చదివితే మంచిస్థాయికి విద్యార్థులు ఎదుగుతారన్నారు. విద్యార్థులకు ఉద్యోగ అవకాశాల కోసం శిక్షణ ఇస్తున్నామన్నారు. కళాశాల పూర్వ విద్యార్థులు రాష్ట్ర, దేశంలో అత్యున్నతస్థాయిలో స్థిరపడ్డారని గుర్తు చేస్తూ.. ఆ పరంపరను కొనసాగించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ పల్లపు చెంచురామయ్య జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని.. ప్రతి విద్యార్థి ఓటు హక్కు వినియోగించుకోవాలంటూ ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు కోలాహలంగా వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం చెంచురామయ్యను సన్మానించారు. కార్యక్రమంలో డాక్టరు కాలే మస్తాన్‌రావు, ఎస్.ఏడుకొండలు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.వెంకటరెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రకాలుగా ఎదగాలి


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమ

సంతనూతలపాడు: బాలికలు అన్నిరకాలుగా ఎదగాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.రమ పిలుపునిచ్చారు. మండలంలోని పేర్నమిట్ట హైస్కూల్ ఆవరణలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర వికాసంలో భాగంగా ర్యాలీ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రమ అధ్యక్షత వహించి మాట్లాడారు. స్కూల్లోని అన్ని తరగతుల విద్యార్థులకు కిశోర వికాసం అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డి.పార్వతి, శాంతి, ఉపాధ్యాయులు మల్లేశ్వరి, స్వర్ణలత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

30, 31న వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవాలు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సభ్యులు

ఒంగోలు మెట్రో: వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి నిజరూప దర్శన (ఆత్మార్పణ) దినోత్సవాలను ఈ నెల 30, 31 తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నట్లు వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి తదియారాధన సంఘ సభ్యులు తెలిపారు. ఒంగోలు నగరంలోని అమలనాథుని వీధిలో కొలువైయున్న వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో నిర్వహించనున్న కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను శనివారం ఆవిష్కరించి వివరాలు వెల్లడించారు. ఒంగోలు నగరంలోని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వాసవీ కోలాట భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.


సంతనూతలపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దార్ ఆదిలక్ష్మి, తదితరులు


చీమకుర్తిలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు


మద్దిపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దార్ సుజన్ కుమార్, తదితరులు

ఓటు హక్కును వినియోగించుకోవాలి

ఒంగోలు సిటీ: పౌరులందరూ ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటుహక్కును వినియోగించుకోవాలని స్థానిక డీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి కోరారు. శనివారం కళాశాలలో రాజనీతి శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఓటర్ల బాధ్యతల గురించి విద్యార్థులకు వివరించారు. రాజనీతిశాస్త్ర విభాగం అధ్యాపకుడు సీహెచ్ వెంకటేశ్వర్లు ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డోలా అనంతలక్ష్మి, పి.యామిని, అమ్మాజీ, మన్నె శ్రీనివాసులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

కొత్తపట్నంలో...

కొత్తపట్నం: ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక తహసీల్దార్ పి.మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి హైస్కూల్ వరకు ర్యాలీ సాగింది. ఆర్ఐ ప్రసాద్‌రావు, రికార్డు అసిస్టెంట్ సుబ్బారావు, రెవెన్యూ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో...

సంతనూతలపాడు: మండల కేంద్రంలో తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి అధ్యక్షతన జాతీయ ఓటర్ల దినోత్సవం ర్యాలీ, మానవహారం నిర్వహించారు. సీనియర్ ఓటర్లను ఘనంగా సత్కరించారు. ఓటు హక్కు మన జన్మ హక్కు అని ప్రతిజ్ఞ చేయించారు. ఎంఈవో డి.వెంకారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ ఎస్‌కే మాబు సుభాని, ఆర్ఐ రామ్‌తేజ, మండల ఎన్నికల ఆపరేటర్ కే అనిల్, వీఆర్వోల సంఘ మండల అధ్యక్షుడు ఎం.శ్రీనివాసులు, మాజీ జెడ్పీటీసీ తన్నీరు శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ రంపతోటి అంకారావు, ఉపాధ్యాయులు, వీఆర్వోలు, వీఆర్ఏలు, విద్యార్థులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో...

చీమకుర్తి: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఓటర్ల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ ఎస్.వరకుమార్, తహసీల్దార్ ఆర్.బ్రహ్మయ్య, కమిషనర్ రామకృష్ణయ్య పాల్గొన్న ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించారు. నూతనంగా ఓటర్లుగా నమోదైన వారికి సర్టిఫికెట్లు అందించారు. 60 సంవత్సరాలు నిండిన సీనియర్ ఓటర్లను సత్కరించారు. కార్యాలయం వద్ద సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేసి ఓటు ప్రాధాన్యతను తెలియజేస్తూ ప్రతిఒక్కరూ సెల్ఫీ దిగే విధంగా ప్రోత్సహించారు. తొలుత జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు, అధికారులు, పలు రాజకీయ పార్టీల నాయకులతో మున్సిపల్ కార్యాలయం మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.

మద్దిపాడులో...

మద్దిపాడు: స్థానిక తహసీల్దార్ సుజన్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది, కొత్తగా ఓటు హక్కు పొందిన యువకులు, సీనియర్ సిటిజన్లు, పలువురు ఓటర్లతో కలిసి ర్యాలీ నిర్వహించారు. మద్దిపాడు సెంటర్లో మానవహారంగా ఏర్పడి ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఓటర్ల దినోత్సవం సందర్భంగా పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. సీనియర్ సిటిజన్లను సన్మానించారు. ఎంఈఓలు ఎంవీఆర్ ఆంజనేయులు, ఎం.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడులో...

నాగులుప్పలపాడు: మండలంలోని అన్ని పోలింగ్ బూత్‌లలో ఓటర్ల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. నాగులుప్పలపాడులో నిర్వహించిన అవగాహన ర్యాలీలో తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ పాల్గొని మాట్లాడారు. ప్రతి పోలింగ్ బూత్‌లో సీనియర్ ఓటర్లను సన్మానించి ఓటర్లచే ప్రతిజ్ఞ చేయించారు. నూతనంగా నమోదైన ఓటర్లకు వివిధ పోటీలు నిర్వహించి ప్రశంసపత్రాలు అందజేశారు.


ఒంగోలులోని డీఎస్ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు


కొత్తపట్నంలో ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దార్ మధుసూదనరావు, సిబ్బంది



నాగులుప్పలపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, సిబ్బంది